క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 29న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. అశోక కాలనీ, నక్కలగుట్ట మెయిన్ రోడ్డు, వినాయక నగర్, భవాని నగర్, గోకుల్ నగర్, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, వికాస్ నగర్, హౌజింగ్ బోర్డు కాలనీ, బాలసముద్రం ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు, రాయపుర వాడ, వేయి స్తంభాల దేవాలయం, యునాని ఆస్పత్రి, శ్రీనివాస కిడ్నీ సెంటర్, కమ్యూనిటీ హాల్, రాగన్న దర్వాజ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరతికి 'ఓయూ డాక్టరేట్'



కాజీపేట: కాజీపేట పట్టణానికి చెందిన బైరి ఆరతికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కమల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల (కిట్స్)లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆరతి పనిచేస్తున్నారు. కాటన్ యీల్డ్ డిటెక్షన్ ఇన్ స్మార్ట్ అగ్రికల్చరల్ యూజింగ్ మెషిన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పీహెచ్‌డీ అందజేశారు. 2005 నుంచి కిట్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆమె పని చేస్తున్నారు.

డిప్యూటీ తహసీల్దార్ వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ ఖన్నా కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్నారు. వైద్యం ఖర్చుల కోసం ఆయన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో ఇరుగుపొరుగు వారు శనివారం ఆయనను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. రాజేష్ ఖన్నా భార్య రమాదేవి మిత్ర బృందం సభ్యులు లత, సంధ్య, సువర్ణ, వర్ష, రక్షిత, విజయలక్ష్మి, సత్యభామ, రజిత, పద్మ కుమారి తదితరులు చేయూతనందించారు.

రాష్ట్రస్థాయికి క్రీడాకారుల ఎంపిక

న్యూశాయంపేట: రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 24, 25వ తేదీల్లో ఓసిటీలో నిర్వహించిన మండల స్థాయి ఎంపిక పోటీల్లో పది మంది బాలురు, పది మంది బాలికలు మెరిట్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వరంగల్ జిల్లా యువజన క్రీడాశాఖాధికారి సత్యవాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో మెరిట్ సాధించిన వారు వచ్చేనెల 2, 3వ తేదీల్లో హకీంపేట క్రీడా పాఠశాలలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఓసిటీలోని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నిర్లక్ష్యం.. ఇద్దరిపై వేటు

హసన్‌పర్తి: విద్యుత్‌శాఖ మార్గదర్శకాలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి అసిస్టెంట్ లైన్‌మెన్ ప్రమాదానికి కారణమైన లైన్‌మెన్ కుమారస్వామి, సబ్‌స్టేషన్ ఆపరేటర్ యుగంధర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈఈ సామ్యానాయక్ శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం జయగిరి సబ్‌స్టేషన్ పరిధిలో చంద్రమూర్తి అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అన్నాసాగరం పరిధిలోని ఎస్ఎస్ 36 / 100 కేవీఏ వద్ద సాంకేతిక సమస్య ఉత్పన్నం కావడంతో చంద్రమూర్తి ఎల్‌సీ తీసుకున్నాడు. స్తంభం ఎక్కి మరమ్మతు చేయడానికి యత్నిస్తున్న క్రమంలో విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలపై విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. రాంగ్ ఎల్‌సీ ఇవ్వడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు. అందుకు ఆ ఏరియా లైన్‌మెన్ కుమారస్వామి, సబ్‌స్టేషన్ ఆపరేటర్ యుగంధర్‌ను బాధ్యులుగా చేస్తూ వారిపై వేటు వేశారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

కాజీపేట రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ప్రయాణికుడికి కాజీపేట జీఆర్పీ పోలీసులు అప్పగించారు. కాజీపేట జీఆర్పీ సీఐ వి.నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా ఏడ్పల్లి మండలం జానంపేట గ్రామానికి చెందిన సయ్యద్ ఫిరోజ్ మూడు నెలల క్రితం రైల్లో ప్రయాణిస్తున్న సమయంలో అతని సెల్‌ఫోన్ పోయింది. ఫిర్యాదు మేరకు సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు సీఐ వివరించారు.

ఉచిత డేటా ఇంజనీరింగ్ కోర్సు

న్యూశాయంపేట: స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా నిరుద్యోగుల కోసం డేటా ఇంజనీరింగ్ కోర్సును శ్రీసత్యసాయి సేవా సంస్థ ఉచితంగా అందిస్తోందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 – 2025 మధ్య బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్, ఎంటెక్ లేదా ఎంసీఏ పూర్తిచేసిన పట్టభద్రులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 90523 72023 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

ఆధార్ పునరుద్ధరణకు గడువు పెంపు

- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం



కాజీపేట: ఆధార్ కార్డుల పునరుద్ధరణకు కేంద్రం మరో ఏడాది వరకు గడువు పొడిగించింది. వచ్చే ఏడాది జూన్ 30వ తేదీ వరకు ఆధార్ కార్డులను పునరుద్ధరించుకోవడానికి అవకాశం కల్పించింది. ఆ తర్వాత కూడా నిర్లక్ష్యం చేస్తే కార్డును యూఐడీఏఐ అధికారులు సస్పెండ్ చేస్తారు. ఒకసారి ఆధార్ కార్డు సస్పెండ్ అయితే దాన్ని పునరుద్ధరించుకోవడానికి వివిధ ధ్రువపత్రాలు జతచేసి మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కార్డుల పునరుద్ధరణకు కొందరు ఉత్సాహం చూపుతుండగా, అవగాహన లేని వారు మాత్రం దూరంగా ఉంటున్నారు. మరికొంత మంది సెల్‌ఫోన్‌లో మై ఆధార్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని పునరుద్ధరించుకుంటున్నారు.

అన్నింటికీ ఆధారం 'ఆధార్'

పదేళ్ల క్రితం ఆధార్ కార్డు పొందిన వారందరూ పునరుద్ధరించుకోవాలని యూఐడీఏఐ నుంచి కార్డుదారులకు సెల్‌ఫోన్‌లో సంక్షిప్త సమాచారం అందుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2011 – 12వ సంవత్సరంలో సుమారు 45 లక్షల మంది ఆధార్ కార్డులు తీసుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. అప్పుడు ఊరూరా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఆధార్ నమోదు చేశారు. పదేళ్ల వరకు మాత్రమే కార్డులు చెల్లుబాటు అయ్యేలా నిబంధనలు విధించారు. ప్రతీ పదేళ్లకు ఒక్కసారి ఆధార్‌ను పునరుద్ధరించుకోవాలని యూఐడీఏఐ సూచిస్తోంది. ప్రస్తుతం ఆధార్ కార్డు కీలకంగా మారింది. బ్యాంకు ఖాతాలు తెరవడం, విద్యార్థుల ప్రవేశాలు, పింఛన్లు, ఉద్యోగ నియామకాలు, రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం ఆర్థిక సాయం, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలకు ఆధార్‌ను తప్పనిసరి చేశారు. ఆధార్ అప్‌డేట్ లేకుంటే కొందరికి రేషన్, పింఛన్లు కూడా ఆగిపోతున్నాయి. ఆధార్ కార్డులు తీసుకున్నప్పటికీ కొందరు అప్‌డేట్ చేసుకోలేకపోతున్నారు. ఇప్పటికే రెండుసార్లు గడువు పొడిగించిన కేంద్రం.. మరో ఏడాది వరకు ఆధార్ పునరుద్ధరణకు గడువు పెంచింది.

ఏమేం కావాలంటే?

ఆధార్‌కార్డు పునరుద్ధరణ, ఇతర మార్పులు చేర్పులకు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పత్రం తీసుకెళ్లాలి. పదో తరగతి మార్కుల మెమో, ఓటరు గుర్తింపు కార్డు, రేషన్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, మ్యారేజ్ పత్రం, తహసీల్దార్ జారీ చేసిన ధ్రువపత్రాలను వెంట తీసుకెళ్తే ఆధార్ పునరుద్ధరణ పూర్తి చేసుకోవచ్చు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాత జనాభా లెక్కల ప్రకారం 45 లక్షల మంది జనాభా ఉన్నారు. ఇప్పుడు మరో రెండు లక్షల వరకు జనాభా పెరిగే అవకాశం ఉంది. వారికి అనుగుణంగా ఆధార్ కేంద్రాలు పెంచాల్సిన అవసరం ఉంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే, తదితరులు

కేయూ క్యాంపస్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని ఎంబీఏ విభాగం ప్రాంగణంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ సిస్టం ప్రారంభం

కాజీపేట: కాజీపేట 62, 63వ డివిజన్ విష్ణుపురి – సోమిడి రోడ్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన నూతన సెంట్రల్ లైటింగ్ సిస్టంను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శనివారం రాత్రి ప్రారంభించారు. కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు సుంచు అశోక్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎండీ.అంకూస్, రహమతుల్లా, భద్రకాళి దేవస్థానం పాలకమండలి సభ్యుడు పాలడుగుల ఆంజనేయులు, పి.మనోహర్, భరత్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను అడ్డుకోవడం సరికాదు

- కేయూ వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు



సమావేశమైన విద్యార్థి సంఘాల నాయకులు

కేయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను అడ్డుకోవడం సరికాదని కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు అభిప్రాయపడ్డారు. కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్ హౌస్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా విద్యార్థి సంఘాల బాధ్యులు డాక్టర్ సయ్యద్ వలీఉల్లా ఖాద్రీ (ఏఐవైఎఫ్), దుర్గం సారయ్య (పీడీఎస్‌యూ), గుగులోతు రాజునాయక్ (గిరిజన శక్తి), మేడ రంజిత్ (టీజీవీపీ), మట్టెడ కుమార్ (పరిశోధకుడు), కన్నం సునీల్ (టీఎస్ఎఫ్), దుప్పటి కిషోర్, కాడపాక రాజేందర్, బొట్ల మనోహర్ (బీఎస్ఎఫ్) మాట్లాడారు. రాష్ట్రంలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాపితంగా వివిధ చోట్ల ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఉపక్రమించిందన్నారు. అందులో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కాగా, కాకతీయ యూనివర్సిటీ భూమిని యూనివర్సిటీ అధికారులు కేటాయించారని గుర్తుచేశారు. ఈ క్రమంలో కొన్ని విద్యార్థి సంఘాలు సొంత రాజకీయ ఎజెండాతో ఆ స్కూల్ ఏర్పాటును అడ్డుకోవాలని చూస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో పీడీఎస్‌యూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, వివిధ సంఘాల బాధ్యులు సౌరవ్, రాహుల్, శివరెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

టాక్స్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా నారాయణరావు



రామన్నపేట / వరంగల్ చౌరస్తా: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వరంగల్‌కు చెందిన చార్టెర్డ్ అకౌంటెంట్ సీఏ వీవీ నారాయణరావు ఎన్నికయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో టాక్స్ కన్సల్టెంట్స్‌కు సేవలందిస్తున్న ప్రతిష్టాత్మకమైన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల టాక్స్ బార్ అసోసియేషన్ సంస్థ 54వ వార్షిక సాధారణ సమావేశాన్ని హైదరాబాద్‌లోని తాజ్ హోటల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో 2025 – 26వ సంవత్సరానికి సీఏ నారాయణరావు ఉమ్మడి రాష్ట్రాల ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కోట అమిత్‌కుమార్ ప్రకటించారు. ఈ మేరకు నారాయణరావుకు వరంగల్ టాక్స్ బార్ సభ్యులు అభినందనలు తెలిపారు.

గ్రామాల వారీగా సమాచారం సేకరణ

మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సంబంధించిన సమాచారాన్ని మడికొండ పోలీసులు సేకరించారు. వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా సూచనలతో కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 8 గ్రామాలు, 3 శివారు గ్రామాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులు సేకరించారు. జనాభా, వివిధ వృత్తులు, రాజకీయ పార్టీల వివరాలు, ముఖ్య స్థలాలు, ప్రముఖ వ్యక్తులు, నేరస్తుల వివరాలు సేకరించినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ వివరించారు. ఏదైనా ఆత్యయిక పరిస్థితి ఏర్పడినప్పుడు ఈ సమాచారం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, ఏఎస్సై చంద్రమౌళి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్యవైశ్య సంఘంపై ఆరోపణలు'

వరంగల్ చౌరస్తా: వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘంలో ఆర్థిక అభియోగాలు జరిగినట్లు వాట్సప్‌ల్లో ప్రచారాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం తగదని సంఘం ప్రధాన కార్యదర్శి మాదారపు రాజేశ్వర్ రావు హితవు పలికారు. వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఓ హోటల్‌లో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఈసీ అత్యవసర సమావేశం శనివారం సాయంత్రం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేశ్వర్ రావు మాట్లాడుతూ నాలుగు నెలలుగా సంఘం అధ్యక్షుడు గుండా ప్రకాశ్‌రావు అనారోగ్య కారణాల వల్ల వేరే ప్రాంతంలో ఉంటున్నారని అన్నారు. ఈ క్రమంలో సంఘం కార్యక్రమాలకు హాజరు కావడం లేదని చెప్పారు. సంఘం ఆర్థిక లావాదేవీల నిర్వహణకు ముగ్గురితో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. 3 నుంచి 6 నెలల్లోగా వివరాలను బహిర్గతం చేస్తామని రాజేశ్వర్‌రావు తెలిపారు.

రాష్ట్రాన్ని కేసీఆర్ లూటీ చేశారు



హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హసన్‌పర్తి: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, ఆయన కుటుంబ సభ్యులు, మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌తో పాటు కవిత కలిసి రాష్ట్రాన్ని దోచుకున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు విమర్శించారు. నియోజకవర్గంలోని హసన్‌పర్తి, హనుమకొండ మండలాలకు చెందిన సుమారు 400 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి కింద విడుదలైన చెక్కులను హసన్‌పర్తి మండల అభివృద్ధి కార్యాలయంలో శనివారం పంపిణీ చేశారు. నగరంలోని 65వ డివిజన్ నిరూప్‌నగర్ తండాలో సుమారు రూ.80 లక్షల వ్యయంతో చేపట్టిన మురుగునీటి కాల్వ పనులను బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ఉదయ్‌కుమార్ రెడ్డి, మేర్గు రాజేష్, గోపాల్ రెడ్డి, కార్పొరేటర్ దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ రాజునాయక్, మాజీ సర్పంచ్ మదన్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కిరణ్ పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం

మడికొండ: తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రజా ప్రభుత్వం అని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. కాజీపేట మండలం మడికొండలో పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 64వ డివిజన్‌లో రూ.5.50 లక్షల సాధారణ నిధులతో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రెయినేజీలు, మడికొండ చెరువు కట్ట సమీపంలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి రూ.10 లక్షల ఎస్ఎఫ్‌సీ నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మెట్టుగుట్ట, రామాలయం చైర్మన్లు పైడిపాల రఘుచందర్, పల్లపు అర్జున్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మండల మహిళా అధ్యక్షురాలు నీలం రజిని వేణుయాదవ్, డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ ప్రభాకర్

- అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్

వరంగల్ క్రైం: ఆటో డ్రైవర్లందరూ విధిగా యూనిఫాం ధరించాలని అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ సూచించారు. హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత – ట్రాఫిక్ నియమాలపై శుభం గార్డెన్‌లో శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. మద్యం తాగి ఆటో నడపొద్దని, ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, అతివేగంగా వెళ్లొద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అన్నారు. నిర్దేశిత ప్రదేశంలోనే ఆటోలు పార్కింగ్ చేయాలని, ఏదైనా నేర సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్లు కొమురెల్లి, నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి



కాజీపేట అర్బన్: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంసీపీఐ నాయకులు



కాజీపేట: వినతి పత్రం అందిస్తున్న నాయకులు

కాజీపేట అర్బన్: ఎన్నికల వాగ్దానాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాస్ సావిత్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు కాజీపేట తహసీల్దార్ భావ్‌సింగ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను పార్టీలకతీతంగా పేదలకు కేటాయించాలని సూచించారు. వికలాంగులకు పింఛన్లు అందించాలని, పెరిగిన బస్సు, రైలు చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో బోయిన రాజు, బండారి మమత పాల్గొన్నారు.

భూభారతి చట్టాన్ని అమలు చేయాలి

కాజీపేట: భూభారతి చట్టాన్ని ఎలాంటి ఒత్తిడికి తావులేకుండా అమలు చేయాలని ఎంసీపీఐ (యూ) నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండ ఇన్‌చార్జ్ తహసీల్దార్ రజిత్‌కుమార్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మొగిళి శ్రీనివాస్ రావు, నీల ప్రశాంతి, మడత అరుణలక్ష్మి, చీపురు ఓదయ్య పాల్గొన్నారు.



హసన్‌పర్తి: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

హసన్‌పర్తి: ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ రహీంకు ఆ పార్టీ సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకురాలు అన్నబోయిన ప్రేమల మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు అనిత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అక్రమ నిర్మాణం నేలమట్టం



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న బల్దియా అధికారులు, సిబ్బంది

వరంగల్ అర్బన్: వివాదాస్పద స్థలంలో అక్రమ నిర్మాణంపై హైకోర్టు ఆదేశాలతో బల్దియా టౌన్ ప్లానింగ్ యంత్రాంగం ఆలస్యంగా స్పందించింది. ఎట్టకేలకు ఆ నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు, డీఆర్ఎఫ్ సిబ్బంది శనివారం నేలమట్టం చేశారు. హనుమకొండ 30వ డివిజన్ అడ్వకేట్స్ కాలనీ సర్వే నంబరు 1015 ఏకశిల హౌసింగ్ సొసైటీ ద్వారా 2011లో 200 గజాలు స్థలాన్ని బజ్జూరి శ్యాంసుందర్ కొనుగోలు చేశారు. ఆ స్థలాన్ని ఓ వ్యక్తి, మరొకరి సాయంతో తన తల్లి గిఫ్ట్ డీడీ చేసిందని కబ్జా చేసి నిర్మాణం చేపట్టారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కోర్టు ఆదేశాలతో అధికారులు కూల్చివేశారు. కార్యక్రమంలో బల్దియా ఇన్‌చార్జ్ ఏసీపీ ప్రశాంత్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు అవినాష్, సతీష్, రాజు నాయక్, వెంకటరమణ పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు, హస్తకళలను ఆదరిద్దాం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

హన్మకొండ చౌరస్తా: చేనేత వస్త్రాలు, హస్తకళలను ఆదరించి, భవిష్యత్ తరాలకు అందిద్దామని యువజన కాంగ్రెస్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ షాపింగ్ ఎక్స్‌పో ప్రదర్శన, అమ్మకాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కళానైపుణ్యం గల చేనేత, హస్తకళాకారుల ప్రతిభ కార్పొరేట్ రెడీమేడ్ రంగాలతో మరుగునపడిపోతోందని అన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు సయ్యద్ కేజర్ మాట్లాడుతూ హనుమకొండలో మొదటిసారిగా పెద్ద ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బెంగాలీ కాటన్, బాందివి సారీస్, డ్రెస్ మెటీరియల్, జైపూర్, యూపీ బెడ్‌షీట్స్, భాగల్‌పూరి సిల్క్స్, జైపూర్ స్టోన్ జువెల్లరీ, వన్‌గ్రాం గోల్డ్, ఇమిటేషన్ జ్యువెల్లరీ, షారన్‌పూర్ ఉడెన్ ఫర్నీచర్ వంటి వస్తువులు సరసమైన ధరల్లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 10గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

డైరెక్టర్లకు టీఆర్‌పీఈయూ సన్మానం



డైరెక్టర్లు మోహన్‌రావు, మధుసూదన్ రావును సన్మానిస్తున్న టీఆర్‌పీఈయూ నాయకులు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ నూతన డైరెక్టర్లను బీఎంఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సన్మానించారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.మోహన్ రావు, ఆపరేషన్ డైరెక్టర్ టి.మధుసూదన్, హెచ్ఆర్‌డీ అండ్ ఐఆర్ డైరెక్టర్ సి.ప్రభాకర్‌ను తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్, ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ అధ్యక్షుడు రావుల రమణారెడ్డి, నాయకులు శనివారం కలిసి సన్మానించారు. కార్యక్రమంలో టీఆర్‌పీఈయూ నాయకులు అనిల్ రెడ్డి, సంగీత్ కుమార్, మహేష్, గంజి కుమార్, వేమన రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, గొలుసు ఉపేందర్, కేసీ.చారి, దామోదర్, చరణ్, అక్బర్, సాదిక్ పాషా, భరత్ కుమార్, ధనలక్ష్మి, వనజ, వనిత, స్వప్న, అహల్య, స్వరూప, పిట్టల రాజు, సాయికృష్ణ, తార్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

విద్యారణ్యపురి: అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ కార్యాలయంలో అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పుట్టగొడుగుల్లా ప్రైవేట్ పాఠశాలలు రోజురోజుకు పుట్టుకొస్తున్నాయని అన్నారు. డిజీ, ఈ–టెక్నో, ఇంటర్నేషనల్ లాంటి తోక పేర్లతో అనుమతులు లేకుండా పాఠశాలలను నడుపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ బాధ్యులు జయకృష్ణసాయి, హరీష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ రెన్యువల్ ఫీజు తగ్గించాలని నిరసన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పీహెచ్‌డీ పరిశోధకులకు రెన్యువల్ ఫీజును తగ్గించాలని పరిశోధకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు క్యాంపస్‌లోని పరిపాలన భవనం వద్ద శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఫీజులు పెంచడంతో పరిశోధక విద్యార్థులపై తీవ్ర భారం పడుతోందన్నారు. గతంలో ఉన్న ఫీజునే కొనసాగించాలని సూచించారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు బి.తిరుపతి, అంకెల శంకర్, డి.తిరుపతి, సుమన్, కందికొండ తిరుపతి, స్వామి, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి దేవాలయ ధర్మకర్తలకు సన్మానం

వరంగల్ చౌరస్తా: ఇటీవల నియమితులైన భద్రకాళి దేవస్థానం ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, అనంతుల శ్రీనివాస్‌ను పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు వరంగల్ ఆర్ఎన్‌టీ రోడ్డులోని పట్టణ ఆర్యవైశ్య సంఘం భవన్‌లో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మాదారపు రాజేశ్వర్ రావు, ప్రతినిధులు అల్లాడి వీరభద్రయ్య, గుండా ముక్తీశ్వర్ రావు, దాచేపల్లి సీతారాం, త్రిపురనేని సదాశివుడు, కొండూరి శివప్రసాద్, సురేష్, శ్రీనివాస్, రఘువీర్, అనంతుల శ్రీనివాస్, తిరుమల రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచడం అభినందనీయం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామం ఎస్సీకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా 20 అడ్మిషన్లు పెరగడం అభినందనీయమని ఎంఈఓ మనోజ్‌కుమార్ అన్నారు. కడిపికొండ ప్రైమరీ పాఠశాలను ఎంఈఓ శనివారం సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చుంచుకాల లింగారావు, జమీలాబేగం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మడికొండ శివారు పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ నుంచి ధర్మసాగర్ వెళ్తున్న ఆటోను ధర్మసాగర్ నుంచి మడికొండ వైపు వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కారులో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తల్లి పేర మొక్క నాటండి

హసన్‌పర్తి: ప్రతిఒక్కరూ తమ తల్లి పేర ఒక మొక్క నాటాలని కాకతీయ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలం జయగిరి శివారులోని బలరాం తండాలో హరితహార కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ అసమతుల్యం వల్ల అనేక ప్రకృతి వైపరీత్యాలు జరుగుతున్నాయని వివరించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు వరంగల్ ఆర్డీఓ, ఖిలా వరంగల్ తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి సంయుక్తంగా ప్రైవేట్ ఎరువుల దుకాణాలు, ఖిలా వరంగల్ సొసైటీలో శనివారం తనిఖీలు చేశారు. షాపుల్లోని ఎరువుల నిల్వలు, ఈ – పాస్, స్టాక్ రిజిస్టర్‌లోని నిల్వను సరిచూశారు.

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు ఘన నివాళి



కేయూలో పీవీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం, అధ్యాపకులు



జేఎన్ స్టేడియం జంక్షన్‌లోని పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు



కాజీపేట డీజిల్ కాలనీలో పీవీ నర్సింహారావు జయంతిలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు